పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డీకే అబీన గురువారం గుంటూరు ఉద్యోగ నిమిత్తం శిక్షణ తీసుకునే సమయంలో ఆ రాత్రి హఠాత్తుగా గుండె పోటు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.శుక్రవారం ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, ఉమ్మడి జిల్లా సహకార సొసైటీ బ్యాంక్ సీఈఓ వర్మ తోటి సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.జీవో నెంబర్ 90, 36 ప్రకారం అభిన కుమారుడికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు.తక్షణం దహన ఖర్చుల కింద 15000 ఇస్తున్నట్లు సీఈఓ వర్మ కుటుంబానికి తెలిపారు. మిగిలిన బకాయిలు అందిస్తామని తెలియజేశారు. సిపిఎం నేత రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

హామీలపై సిఎం ప్రకటన చేసేనా?

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి, శతశాతం ఉద్యోగ రిజర్వేషన్‌పై ఆశలు ▶▶ నేడు పాడేరులో ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న సిఎం చంద్రబాబు అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ పర్యటనపై ఆదివాసీల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆదివాసీలకు సీఎం చంద్రబాబు, ఎపి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు స్పష్టమైన ప్రకటన ఈ పర్యటనలో వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ పర్యటనతోనైనా జిఒ-3 రిజర్వేషన్, ప్రత్యేక డిఎస్ సి, ఇతర సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయనే ఆశ స్థానికుల్లో వెల్లడవుతోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో 22 ఏప్రిల్ 2020లో జిఒ-3 రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అప్పటి నుంచి జిఒ-3కి ప్రత్యామ్నాయం చూపి గిరిజనుల ఉద్యోగాలను కాపాడాలని, గిరిజన స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో వినతులూ, విజ్ఞప్తులూ, నిరసనలూ, ఆందోళనలు చేసినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా జిఒ-3 సమస్యను నాలుగేళ్ళు అటకెక్కించింది. దీంతో నాలుగేళ్ళుగా స్థానిక గిరిజన యువతకే దక్కాల్సిన ప్రభుత్వ శాఖల్లోని వేలాది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే జిఒ-3 రిజర్వేషన్‌ను పునరుద్ధరిస్తామని 2024 జనవరి 20న అరకు ఎన్నికల సభ సందర్భంగా ప్రతిపక్షనేతగా సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరకపోవడంపై ఆదివాసీల్లో అసంతప్తి, ఆందోళన నెలకొంది. జిఒ-3 రిజర్వేషన్ కు ప్రత్యామ్నాయం చూపకుండానే ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తో గిరిజన యువత తాము కోల్పోతున్న ఉద్యోగాలను చూస్తూ తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జిఒ-3 రిజర్వేషన్‌కి సంబంధించి ప్రత్యామ్నాయం చూపడంలో జాప్యం జరుగుతుండడంతో స్థానికుల్లో అసంతప్తి వ్యక్తమవుతోంది. జిఒ-3కి ప్రత్యామ్నాయంగా ఆదివాసీల ఉద్యోగ అవకాశాలు కాపాడే రిజర్వేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజన స్పెషల్ డిఎస్ సి పైనా ఆదివాసీలు ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వ మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తో ఆదివాసీ నిరుద్యోగులకు తీరని నష్టం జరుగుతోంది. మెగా డిఎస్ సి నోటిఫికేషన్‌లోని 16,347 పోస్టుల్లో అల్లూరి, మన్యం జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులకు కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్ లో 400 పోస్టులకు గాను కేవలం 24, రంపచోడవరం డివిజన్ లో 112 పోస్టులకు గాను 6 పోస్టులు మాత్రమే కేటాయించారు. దీంతో, తమ ప్రాంతంలో తమకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కకుండా పోతుండడంతో గిరిజనుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి ప్రకటించి, స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతో ఈ పోస్టులను భర్తీ చేస్తేనే వారికి మేలు కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా నిర్వహించే డిఎస్ సి ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర వర్గాల టీచర్ పోస్టులను భర్తీ చేస్తుంది. వీటిలో గిరిజనులకు ఏడు శాతం మాత్రమే రిజర్వేషన్ వుంది. అయితే గిరిజన ప్రాంతంలో బిఎడ్, డిఎడ్ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా (గిరిజన) డిఎస్ సి నిర్వహించి, అన్ని పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేస్తుంది. గిరిజన నిరుద్యోగ యువతతో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు గిరిజన స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలోనైనా గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ-3 రిజర్వేషన్ పై, గిరిజన స్పెషల్ డిఎస్ సిపై స్పష్టమైన ప్రకటన చేయాలనే డిమాండ్ వారి నుంచి వస్తోంది.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లపై వైఖరేమిటో

అనంతగిరి:ఆదివాసి గిరిజనుల మనుగడను తీవ్ర నష్టాన్ని గురి చేసే అదాని ఎనర్జీ, నవయుగ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటనపై ఎదురు చూస్తున్నారు. జిల్లాలో పెదకోట, గుజ్జేలి, చిట్టంపాడులో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణంతో వేలాది మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అడవులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయి. హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణంతో సుమారు 100 గ్రామాల్లో 10 వేల మంది ఆదివాసులు ఇబ్బందులు పడుతారు. సుమారు 7 వేల ఎకరాల ఆటవీ భూములు ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గుజ్జెలిలో డ్రోన్ సర్వే నిర్వహించడమే కాకుండా మైలురాళ్ళు ఏర్పాటు చేశారు. అరకు మండలం లోతేరు గ్రామానికి పారే గెడ్డను మళ్లించి పవర్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్టులను ఆపాలని ఆదివాసి గిరిజన సంఘం పెదత్తున్న పోరాటం చేస్తుంది.

చంద్రబాబు పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

సూచనలు ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈ నెల 9న శనివారం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా పాడేరు మండల పరిధిలో సీఎం పర్యటించనున్న లగిసపల్లి, వంజంగి గ్రామాల్లో ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. లగిసిపల్లి గ్రామంలో సీఎం హెలికాప్టర్ దిగేందుకు హెలిపాడ్ ఏర్పాటు చేశారు. కొద్ది దూరంలోనే సీఎం పాల్గొనే బహిరంగ సభ కోసం ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. వంజంగి గ్రామంలో గిరిజన సాంప్రదాయ రీతిలో చావిడి ఏర్పాటు చేసి ఆదివాసి పండగలు ఆచార వ్యవహారాలను సీఎంకు ప్రదర్శన ద్వారా చూపేందుకు ఒక ప్రత్యేక ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. హెలికాప్టర్ ట్రయల్ రన్‌తో పాటు కాన్వాయ్ తదితర ఏర్పాట్లను పరీక్షించారు. అలాగే సీఎం పర్యటన దృష్ట్యా జిల్లా కేంద్రం పరిసరాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం భద్రత దృష్ట్యా పటిష్ట ఏర్పాట్లను నిర్వహించడంపై అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ తదితరులు సీఎం పర్యటన ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

షెడ్యూల్ వివరాలు:

సీఎం పర్యటన వివరాలను ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ మీడియాకు వివరించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్లో పాడేరు మండలం లగిసపల్లిలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ కు చేరుకుంటారన్నారు. 10.25 గంటలకు వంజంగి గ్రామానికి బయలుదేరి వెళతారని, 10.25 నుంచి 11.40 గంటల వరకు దేవాలయ సందర్శన, ఆదివాసీ దినోత్సవంలో భాగస్వామ్యం అవుతారని పేర్కొన్నారు, ఈ క్రమంలో గిరిజన సాంప్రదాయ పండుగలు తదితర వాటి గురించి సీఎం కు ప్రదర్శన ద్వారా ఆదివాసీలు వివరించనున్నారు అనంతరం వంజంగి గ్రామంలోని గిరిజన కుటుంబాల గృహాలను సీఎం సందర్శించ నున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని కాఫీ తోటలను ఆయన సందర్శిస్తారు. కాఫీ తోటల్లో రైతులతో ముఖాముఖి కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం లగిసపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు చేరుకొని 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు పలు ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. విరామం అనంతరం సీఎం బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు లగిసపల్లిలోని హెలిప్యాడ్ కు చేరుకొని విజయవాడకు బయలుదేరి వెళతారని కలెక్టర్ వివరించారు.

లగిసిపల్లిలో ఏర్పాటు చేస్తున్న ప్రజా వేదిక

రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీవర్షం కురిసింది. దీంతో జనజీవనం ఎక్కడికక్కడే నిలిచిపోయింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. రంపచోడవరంలో సిటైప్ క్వార్టర్స్, ఎర్రంరెడ్డినగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో వరద నీరు రోడ్లపై చేరి ప్రవహిస్తోందని సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో భారీవర్షం కురిసింది. ఈదురు గాలులకు మండలంలో పలుచోట్ల వృక్షాలు నేలకూలాయి. విద్యుత్‌తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా తీవ్రమైన ఎండలు ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు వర్షానికి సేద తీరారు.

అరకు, విశాఖ ఘాట్ రోడ్డులో కుండపోత వర్షం

అరకులోయ:అరకు -విశాఖ ఘాట్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం కుండ పోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా మూడు గంటల పాటు వర్షం కురవడంతో ఘాట్ రోడ్డు అంతా వర్షపు నీటితో నిండిపోయి చెరువును తలపింపజేసింది . దీంతో వాహన చోదకులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు మెరుపులు, పిడుగులతో వర్షం కురవడంతో ఈ ప్రాంతంలో పర్యాటకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సెలవులు కావడంతో శుక్రవారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుండ పోత వర్షం కురవడంతో పర్యాటకులు తిరుగు ప్రయాణం కట్టడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం అరకు ఘాట్ రోడ్లో గుంతలు పూడ్చాలని పర్యాటకులు, వాహన చోదకులు కోరారు.

అరకులోయలో చెరువును తలపిస్తున్న విశాఖ - అరకు రోడ్డు

ఎంపికైన క్రీడాకారులు

ఆలిండియా కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-సీలేరు: రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 13 మంది క్రీడాకారులను 47వ ఆలిండియా కబడ్డీ పోటీలకు స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫీసర్ కుమారు వడివేలు ఎంపిక చేసినట్టు ప్రకటించారు. సీలేరు కబడ్డీ జట్టులో చక్కటి ఆట తీరని ప్రదర్శించి ప్రతిభ కనబరిచిన స్పోర్ట్స్‌కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు సంతాన శామ్యూల్ (పండు) మండల శ్రీను ఎంపిక కావడం విశేషం. ప్రథమ స్థానం పొందిన పల్నాడు జట్టు నుంచి రత్నరాజు, మల్లికార్జున్, అచ్యుత్, నెల్లూరు జట్టు నుంచి రాజశేఖర్, సందీప్, గోవిందు(ఆర్‌టిపిపి) నుంచి ఓబిలేష్, శ్రీకాకుళం జట్టు నుంచి నాయుడు తిరుపతి జట్టు నుంచి శేషాద్రి, కుమారులను ఎంపిక చేసామన్నారు. సీలేరుకు చెందిన కింసాలామా ఏలూరికి చెందిన మేనేజర్లుగా ఎంపిక చేసామని వడివేలు తెలిపారు. ఆలిండియా క్రీడలు తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్టలో సెప్టెంబర్ ఒకటి నుంచి నాలుగో తేదీ వరకూ నిర్వహించనున్నారని తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ముఖ్యమంత్రి దృష్టికి ఆర్‌వి నగర్ రహదారి సమస్య

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకూ అంతర్రాష్ట్ర రహదారి పనులు వెంటనే ప్రారంభించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్, దుప్పిలివాడ, గుమ్మిరేవులు మాజీ సర్పంచులు అల్లంకి రాజు. ఓదారి బాబురావు విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంగవరం అగ్రహారం చోడిరాయి బ్రిడ్జిలు పూర్తిస్థాయిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సమస్యలపై చాలాసార్లు అధికారులు దష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పాడేరు పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఆయా సమస్యలపై వినతిపత్రం ద్వారా కోరుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లుదొర, జీకే వీధి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోను టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పారావు ఎం సత్తిబాబు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సిహెచ్ బుజ్జి వార్డు మెంబర్లు రామచంద్ర సీసా మోసియా పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - రంపచోడవరం : సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ బదిలీపై వెళుతున్న సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ తహశీల్దార్లు, కార్యాలయ సిబ్బంది, రంపచోడవరం డివిజన్ ఎపిఆర్ఎస్ అసోసియేషన్ సభ్యులు సబ్‌కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్లు మాట్లాడుతూ సబ్‌కలెక్టర్‌గా ఆమె ఏజెన్సీ ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు.

సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం

ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అంగన్‌వాడీ భవనం ప్రారంభం కాక అద్దె భవనంలోనే అంగన్వాడి కేంద్రం నిర్వహణ జరుగుతుంది. లక్షలు వెచ్చించి కొత్త భవనాన్ని నిర్మించారు. కానీ సంవత్సరాలు గడుసున్నా అంగన్‌వాడీ భవనం మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు. అద్దె భవనంలోనే అంగన్వాడి నిర్వహణ జరుగుతుంది.కనీసం చిన్నారులు ఆడుకోవడానికి ఆట స్థలం లేని పరిస్థితి నెలకొంది. దీంతో చిన్నారులు ఎలా చదువుకుంటారని స్థానికులు మండి పడుతున్నారు.

అరకులోయ మండలం కేంద్రంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగుడలో అంగన్‌వాడీ భవనం లేక పోవడంతో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అంగన్వాడి కేంద్రం నిర్వహణ చేస్తున్నారు. అంగన్‌వాడీ నూతన భవనాన్ని నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభించక పోవడంతో అద్దె భవనంలోనే కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిం చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం: మండలంలోని సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజి మహరాజ్ తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారి ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్లు, ఇవ్వనున్నట్లు, కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) అవసరమైన వారికి వేమగిరి తరలించనున్నట్లు స్వామీజీ తెలిపారు, ఆపరేషన్లు నిమిత్తం వచ్చు వారు ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు తీసుకుని రావాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం పంచాయతీకి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో రూ.60లక్షల సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాబార్డ్ ప్రాజెక్ట్ స్పెషల్ కాంపోండ్ ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ రోడ్డు పనులు చోద్యం జంక్షన్ నుంచి హైస్కూల్ వరకు చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, డిఈ రుత్తల సత్యనారాయణ, చోద్యం మాజీ సర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్, చోద్యం టీడీపీ పార్టీ అధ్యక్షులు అడిగర్ల సోమినాయుడు పాల్గొన్నారు.

శతశాతం రిజర్వేషన్‌పై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు
- ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలని పలువురు నాయకుల పిలుపు

మారేడుమిల్లి : ఆదివాసీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి : ఆదివాసీ జెండాను ఆవిష్కరిస్తున్న లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఆదివాసి దినోత్సవ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీలో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ అమలుపై నేడు ప్రకటన చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతారామారావు శుక్రవారం డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వారోత్సవాల్లో భాగంగా, మండలంలోని శుక్రవారం కేశవరం,చికిలింతలో గిరిజన సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేతలు కొండ్ల సూరిబాబు, జర్తా రాజు, మేలిన రమేష్, లోతా శ్రీను, ఎం గంగరాజు తదితరులు మాట్లాడుతూ నేడు ఆదివాసి దినోత్సవ నేపథ్యంలో గిరిజనుల హక్కులు, చట్టాలు పటిష్ట అమలుకై భవిష్యత్తులో జరిగే ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం నేతలు కోండ్ల సూరిబాబు, మేలిన రమేష్, జనుమూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి ప్రజానాట్యమండలి సహకారం

వి.ఆర్.పురం:ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కూనవరంలో నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవం కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కళాకారులు తమవంతు సహకారంగా కళారూపాలు ప్రదర్శించ బోతున్నారని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.వి. తెలిపారు. వి.ఆర్.పురం మండలం సున్నంవారిగూడెంలో రెండు రోజులుగా పి.ఎన్.ఎమ్. కళాకారులు డ్యాన్స్ శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ శిక్షణా శిబిరం సందర్భంగా సున్నం వారిగూడెంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నాలుగు విలీన మండలాల పిఎన్ఎం నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో జిల్లా నాయకులు సిహెచ్ సుబ్బారావు, సోడె దుర్గారావు, కారం కన్నారావు, ఆసు ప్రసాద్, పి.రాధాకృష్ణ, సున్నం నరసయ్య. తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : సమావేశానికి హాజరైన గిరిజనులు

ఆదివాసీ దినోత్సవానికి తరలిరావాలి

కోయతోర్ పండూం దక్కట్ కూనవరం కార్యక్రమానికి అంతా హాజరు కావాలని మండల గిరిజన సంఘ నాయకులు కదల కొండారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జీడిగొప్పలో ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల అస్తిత్వాన్ని రక్షించాలంటే వారికి రాజ్యాంగ పరమైన హక్కులు వుండాలన్నారు.

కూనవరం: మండలంలోని పల్లూరు గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం జెండా ఎగురవేశారు. కార్యక్రమం విజయవంతం చేయాలని గిరిజన నాయకులు మడెం బాబూరావు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభ్యున్నతికి (అభివృద్ధికి)ఎక్కువ నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోడీ రాజు, మడకం తులసి, ఎం లక్ష్మీ పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలో ఆదివాసి జెసి ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పాడేరు జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో షెడ్యూల్ ప్రాంతాల ఉద్యోగ నియామక చట్టంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామకానికి ప్రత్యేక జిఒ విడుదల చేయాలని వారు కోరారు. అలాగే గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించిన పిఒకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని పెద్దఆర్కూర్ పంచాయతీ లోని సమస్యలకు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ఐటిడిఎ పిఒ అపూర్వభరత్‌కి సర్పంచ్, ఎంపిటిసి కృతజ్ఞతలు తెలిపారు. కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెద్దఆర్కూర్ పంచాయతీ పరిధిలోని పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, రహదారుల సమస్యల గురించి చింతూరు పిఒకు కలిసి గ్రామాల్లో సమస్యలు తెలుపగా పిఒ అపూర్వభరత్ తక్షణమే స్పందించి తన సిబ్బందితో పంచాయతీలో అన్ని గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి, కొన్ని సమస్యలు గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీటిలో బండారుగూడెం స్కూల్ మరమ్మతు పనులు ఈ సోమవారమే మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గండి కొత్తగూడెం రోడ్డు, స్కూలు, అంగన్‌వాడీ భవనం మరమ్మతు పనులు కూడా మంజూరు చేస్తున్నట్లు పిఒ తెలిపారు.మరియు భగవాన్‌పురంలో సర్పంచ్ నాగమణి చెప్పిన వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేసే విధంగా అధికారులను ఆదేశించారు. గండికొత్తగూడెం గ్రామంలో తొండా చరణ్ అనే యువకుడును దత్తత తీసుకుంటున్నట్లు పిఒ తెలిపారు. రేపాకలో 40 ఎకరాల భూమి రీ సర్వే చేసేందుకు తహశీల్దార్‌ని ఆదేశించారన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం గౌరవ అధ్యక్షులు దేవరి శశికుమార్, జిల్లా కార్యదర్శి గెమ్మెలి మోహన్ రావు, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ యూవీ గిరి, చింతపల్లి మండల అధ్యక్షులు బౌడు గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం వారు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనుమరుగవుతున్న ఆదివాసీ చట్టాలను పరిరక్షించుకోవడానికి ఆదివాసీ ప్రజానీకం అంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. చింతపల్లిలో శనివారం జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గూడెం కొత్త వీధి మండలం డిటి దుమంతి సత్యనారాయణ, జన జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ముర్ల వెంకటరమణ, కోశాధికారి గెమ్మెలి మోహన్ రావు, సెక్రటరి పొట్టుకూరి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ అధ్యక్షులు రిమల భరత తదితరులు పాల్గొన్నారు.

న్యాయ ఐక్యతకు కృషి చేద్దాం

జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

మాట్లాడుతున్న జెవివి జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార. : వివిధ కళారూపాల్లో విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి జన విజ్ఞానం, చైతన్యమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జెవివి జాతీయ అధ్యక్షులు వీ బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఒపిఎసి, జెవివి సంయుక్త ఆధ్వర్యాన 'భావ తరంగం వైజాగ్-2025' దేశానికి న్యాయం ఐక్యత అంశంపై మాట్లాడారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రజల న్యాయ ఐక్యత కోసం అందరూ కృషి చేయాలన్నారు. కులం మతం లేని సమాజ స్థాపనకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. నాగార్జున యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ వి బాల మోహన్ దాస్ 'గాంధీయవాదం రాజకీయ ప్రాముఖ్యత' అంశంపై మాట్లాడుతూ గాంధీజీ భావాలను ప్రతిఒక్కరూ తప్పకుండా తెలుసుకోవాలన్నారు. గాంధీజీపై రెండు పుస్తకాలు, 175 కథలు గాంధీపై రాశానన్నారు. అహింసా మార్గంలో స్వాతంత్ర్యసాధనకు ఉద్యమించిన గాంధీజీని నాడు ప్రపంచ మేథావులే కొనియాడారని, నేడు కొందరు తప్పుడు వదంతులు ప్రచారం చేయడం విచారకరమన్నారు. ఒపిఎసి వ్యవస్థాపకులు ప్రియాంక దండి మాట్లాడుతూ మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు జన విజ్ఞాన వేదికతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. దామోదరం సంజీవయ్య లా వర్సిటీ మాజీ విసి సత్యనారాయణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ విసి జార్జివిక్టర్, కృష్ణాజీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షులు విజయ్‌చందర్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ విశ్వేశ్వర నాయుడు

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి-అరకు లోయ: మండలంలోని మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను డీఎంహెచ్ఓ టి.విశ్వేశ్వర నాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల సిబ్బందితో సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి, ఐపి, ల్యాబ్, ఫార్మసీ, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ కు సంబంధించిన అన్ని రికార్డులు పరిశీలించారు. ఎపిడమిక్ సీజన్ ను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని ఆయన సూచించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రస్తుతం విష జ్వరాల సీజన్ కావడంతో ప్రజల ఆరోగ్య పరిస్థితి, గ్రామాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. మలేరియా టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గ్రామాల్లోని గిరిజనులకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ సందర్భంలో హెచ్ ఇ ఒ లక్ష్మి, డి ఐ ఒ డాక్టర్ కమలాకుమారి పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదమే లక్ష్యం

ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ

సెంట్రల్ జైలులో గంజాయి ఖైదీలతో మాట్లాడుతున్న ఐజి రవికృష్ణ

ప్రజాశక్తి - ఆరిలోవ : కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తూ, సమాజాన్నే బలహీనపరుస్తున్న గంజాయి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ లా అఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) ఛీఫ్ ఆకే రవికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించారు. అక్కడ గంజాయి కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. ఆర్థిక అవసరాల కోసం గంజాయి కేసుల్లో ఇరుక్కుని, కుటుంబాలకు దూరంగా జైళ్లలో మగ్గిపోతున్నామని పలువురు ఖైదీలు ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుంచి విడుదలైన తర్వాత గంజాయికి దూరంగా స్వచ్ఛమైన జీవనం గడపాలని ఐజి వారికి సూచించారు.

అనంతరం విలేకర్లలో ఐజి రవికృష్ణ మాట్లాడుతూ, విశాఖ సెంట్రల్‌జైలులో 1800మంది ఖైదీలు ఉంటే వారిలో వెయ్యిమందికి పైగా గంజాయి కేసుల్లో ఇరుక్కున్నవారే ఉన్నారన్నారు.గంజాయి స్మగ్లర్లపై దృష్టిపెట్టి, నామరూపాల్లేకుండా చేయడమే లక్ష్యంగా ఈగల్ పనిచేస్తోందన్నారు. అల్లూరి జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామని, ప్రత్యామ్నాయ పంటలకు సాగుచేసే గిరిజన రైతులకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు గంజాయి కేసుల్లో పట్టుబడితే కఠినమైన జైలుశిక్షలతోపాటు వారి ఆస్తులను జప్తు చేస్తామని, ప్రభుత్వ సంక్షేమం కట్ చేస్తామన్నారు.

ఇటీవల ఉమ్మడి జిల్లాలో పట్టుబడిన గంజాయి కేసులన్నీ ఒడిశా నుంచి వచ్చేవేనని, వాటిని పూర్తిగా నియంత్రించేందుకు 85అంతరరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కాలినడకన ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టామన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువతను దూరం చేసేందుకు విస్తృత అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఈగల్ ద్వారా వీటిని కొనసాగిస్తామన్నారు. విద్యాలయాలకు వంద మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు లేకుండా కఠిన చర్యలు చేపడతామన్నారు. గంజాయి,డ్రగ్స్‌కు రాష్ట్రంలో సుమారు 850 హాట్ స్పాట్స్ గుర్తించామని, ఆయాప్రదేశాల్లో గట్టి నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు, ఉప పర్యవేక్షణాధికారులు ఎన్.సాయిప్రవీణ్, సిహెచ్ సూర్య కుమార్, జైలర్స్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నానోపార్టికల్స్‌తో బహుళ ప్రయోజనాలు

గీతంలో ఎన్‌సిఎల్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-మధురవాడ : ఎలక్ట్రానిక్స్, ఆప్టికల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలకు అవసరమైన నూతన ఆవిష్కరణలకు మెటల్ నానోపార్టికల్స్ దోహదపడుతూ బహుముఖ ప్రయోజనకారిగా నిలుస్తున్నాయని నేషనల్ కెమికల్ లేబోరేటరీ(ఎన్‌సిఎల్) శాస్త్రవేత్త, నానో పరిశోధనా కేంద్రం డైరక్టర్ డాక్టర్ బిఎల్‌వి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, మెటల్ నానో పార్టికల్స్ వినియోగం వైద్య, పర్యావరణ, శక్తి ఉత్పాదక రంగాలలో పెరుగుతోందన్నారు నూతన పదార్థ విజ్ఞానంపై పరిశోధక విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్.ఎస్.అనంత రామకృష్ణ అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వేదవతి, కెమెస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ అంజలీయూ, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ విడిఎన్.కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం : గండిగుండం జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గండిగుండం గ్రామానికి చెందిన మడపాద రాము (66) దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. కోరమండల్ పెయింట్స్ కంపెనీలో కూలిగా పనిచేస్తున్న రాము, శుక్రవారం ఉదయం 5.50 గంటల సమయంలో తన పెద్ద కుమార్తె వరలక్ష్మి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్న సమయంలో పెందుర్తి నుండి ఆనందపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో రాము అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు రాముకు భార్య దేవుడమ్మ, నలుగురు వివాహితులైన ఆడపిల్లలున్నారు. ఇటీవలే గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైన దేవుడమ్మను అతని భర్త రాము జాగ్రత్తగా చూసుకునే వాడని, ఇపుడు ఆయన మరణంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అందిన సమాచారం మేరకు ప్రమాదస్థలికి చేరుకున్న ఆనందపురం ట్రాఫిక్, హైవే పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిఐ సిహెచ్ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పందిరి శివ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

పింఛను మంజూరు చేయరూ..

బాధిత మహిళ సుందరమ్మ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండలంలోని బస్కి పంచాయితీ దేవరపల్లి గ్రామానికి చెందిన బాకా సుందరమ్మ(49) వితంతువు పెన్షన్‌కు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. తన భర్త బాకా గోపన్న మరణించడంతో వితంతువు పింఛన్ల కోసం బస్కి గ్రామ సచివాలయంలో అనేక సార్లు దరఖాస్తులు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పెన్షన్ కోసం ప్రభుత్వ కార్యాలయాలకు పలుమార్లు దరఖాస్తులు ఇచ్చానని, రేపు, మాపు పెన్షన్ వస్తాదని ఎదురు చూస్తూనే ఉన్నానని తెలిపింది. రెండేళ్ళు కావస్తున్నా పింఛను మంజూరు కాలేదని ఆమె తెలిపారు. సచివాలయ సిబ్బందిని అడిగితే పొంతన లేని సమాధానం చెపుతున్నారని ఆమె తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కు కూడా పిర్యాదు చేశానని, కనీసం పట్టించుకోలేదని పేర్కొంది. మండలాధికారులే సమస్యలు పరిష్కరించకపోతే మరి ఎవరు పరిష్కరిస్తారని ఆమె వాపోయింది. . తన భర్త కు వచ్చే పెన్షన్ పైనే భార్య,భర్తలు ఆధారపడి జీవనం గడిపేవారని, భర్త చనిపోయాక పింఛన్ ఆగిపోయింది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆమె అన్నారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పెన్షన్ మంజూరు చేసి అందుకోవాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆమె అన్నారు.

క్రీడా పోటీలకు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం: జాతీయ క్రీడా దినోత్సవ పోటీల్లో విశాఖపట్నం జిల్లాకు ప్రాతినిధ్యం వహించే గౌరవం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దక్కింది. ఉమ్మడి ఎస్‌ఎపి సమగ్ర క్రీడా సముదాయంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన పలువురు యువ క్రీడాకారులు జిల్లా స్థాయి వేదికపై ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు.ఖోఖోల బి. హర్ష, హేమంత్, గౌతమ్, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచిన చరణ్, 3వ స్థానంలో ఎం. శ్రీను, 400 మీటర్ల పరుగు పందెలో మొదటిస్థానంలో నిలిచిన లక్ష్మణ్, 800 మీటర్ల పరుగులో తృతీయస్థానంలో నిలిచిన గణేష్, లాంగ్ జంప్‌లో కిరణ్, వినయ్ జిల్లాజట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి సిద్ధం చేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జిలతో పాటు విద్యార్థులను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపి, జిల్లా స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

సెల్‌టవర్‌పై పిడుగు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో గురువారం ఉరుములు పిడుగులు, ఈదురుగాలితో భారీ వర్షం కురిసింది. జడ్డంగి బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌పై పిడుగు పడడంతో సెల్ టవర్ కేజ్‌కు చెందిన పరికరాలు, ఎలక్ట్రికల్ పరికరాలతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కాలిపోయాయి. గ్రామంలో మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా దగ్ధమయ్యాయని ఎలక్ట్రికల్ ఎఇ అబ్బాయిదొర శుక్రవారం తెలిపారు. షెల్టర్ సమీపంలో ఉంటున్న భూదేవి అనే మహిళ ఇంట్లో రెండు విద్యుత్ మీటర్లు, ఎలక్ట్రికల్ పరికరాలు కూడా దగ్ధమైనట్లు ఆయన తెలిపారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా చాలాసేపు నిలిచిపోయింది.

10న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి - గంగవరం: ఈనెల 10వ తేదీన ఎల్లవరంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు), రంపచోడవరం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో చంద్రబాబు ష్యూరిటి -మోసం గ్యారంటీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైసిపి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని పిలుపు నిచ్చారు.

మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

త్వరలో పంచాయతీల నిధులు జమ

- పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మూడో విడత కేంద్ర ప్రభుత్వం 15 శాతం నిధులు రూ.1120 కోట్లు వెంటనే విడుదల కానున్నాయని, అవి సెప్టెంబర్ నెలాఖరులోగా పంచాయతీల ఖాతాలో జమ అవుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా పంపిన నిధులు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సర్పంచుల ఖాతాలో జమ చేయకుండా సుమారు రూ.8669 కోట్లు దారి మళ్లించి పంచాయతీలను, సర్పంచులను భ్రష్టు పట్టించారని గుర్తు చేశారు. 2024- 25 వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో విడత నిధులు రూ.1120 కోట్లు వెంటనే విడుదల చేసి సర్పంచుల ఖాతాలో జమ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌లకు వినతి పత్రం అందించామని వారు స్పందిస్తూ సెప్టెంబర్ నెలాఖరులోపల సర్పంచ్‌ల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వినోద్‌రాజు, ఉమ్మడి విశాఖజిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు చింతకాయల ముత్యాలు, పంచాయతీరాజ్‌ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వానపల్లి ముత్యాలరావు, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్కా ధనుంజయ యాదవ్ లు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేకంగా శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించారు. 85 మంది ఉభయదాతలు స్వయంగా పాల్గొన్నారు. పోస్టల్ ద్వారా 20,025 మంది భక్తుల పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న వారికి దేవాలయం పూర్వపు చైర్మన్ కొల్లి సింహాచలం సమకూర్చిన 10 గ్రాముల వెండి విగ్రహాన్ని డ్రా ద్వారా కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి అందజేశారు. వరలక్ష్మి వ్రతం కావడంతో అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు.

శరవేగంగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం పనులు

- వచ్చే ఏడాది మార్చి 26కి రెండు యూనిట్లు వినియోగంలోకి..

చీఫ్ ఇంజినీర్ రాజారావు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రెండో దశ నూతనంగా నిర్మిస్తున్న రెండు యూనిట్లు పనులు శరవేగంగా జరుగుతున్నాయని చీఫ్ ఇంజనీర్ కె.వి.రాజారావు వెల్లడించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్ 115 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు వచ్చే ఏడాది మార్చి 26 నాటికి పనులు పూర్తి చేసి వినియోగంలో తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అధికారుల ఆదేశాల మేరకు యూనిట్ పనులు త్వరితగతిలో పూర్తి చేయడానికి ఒక ప్రణాళిక ప్రకారం ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం 6వ యూనిట్‌కు స్పైరల్ కేస్ మూడో దశ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని మరొక స్టేజి కాంక్రీట్ వేస్తే కాంక్రీట్ పనులు పూర్తవుతాయన్నారు. 5వ యూనిట్‌కు టర్బన్‌ఫ్లోర్ కాంక్రీట్ పనులు కోసం రైన్ ఫోర్స్‌మెంట్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తయిన వెంటనే జనరేటర్ బేరల్ వరకు మరో దశ కాంక్రీట్ పనులు చేపట్టాల్సి ఉందని ఈ పనులు పూర్తయితే ఎలక్ట్రికల్ మెకానికల్ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సిద్ధం చేసిన రోటారు బరువు 185 టన్నుల బరువు ఉంటుందని వీటిని లిఫ్ట్ చేయడానికి జల విద్యుత్ కేంద్రంలో 300 టన్నులు సామర్థ్యం గల రెండు క్రేన్లు సామర్థ్యంపై టెస్టింగ్ నిర్వహించామన్నారు. వచ్చే ఏడాది మార్చి 26, 31 నాటికి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రెండు యూని ట్ల ద్వారా 230 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో పనులు వేగవంతం చేస్తున్నామని చీఫ్ ఇంజనీర్ తెలిపారు. ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న (మాచ్‌ఖండ్) జల విద్యుత్ కేంద్రంలో గురువారం అకస్మాత్తుగా విశాఖపట్నం వెళ్లే ఫీడర్లు ట్రిప్ అవ్వడం వలన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేశామన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

బురదమయమైన కొండ్రారాజుపేట రోడ్డు

టేకులబోరు శబరికొత్తగూడెం రహదారి

ప్రజాశక్తి - వి.ఆర్.పురం/కూనవరం : కూనవరం మండల కేంద్రంలో ప్రధాన రహదారి టేకులబోరు నుండి ఇంటర్ కాలేజీ మీదుగా పాండ్రారాజుపేట పూసగూడెం శబరికొత్తగూడెం వరకూ అధ్వానంగా తయారైంది. కూనవరం మండలంలో గ్రామాల్లో అంతర్గత రోడ్లకు దిక్కులేదు కనీసం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కూడా అదేవిధంగా ఉంది. టేకుల బోరు నుండి శబరికొత్తగూడెం వరకూ ప్రధాన రహదారి గోతులతో నిండిపోయింది. టేకులబోరు నుండి పాండ్రారాజుపేట వరకు ఉన్న రోడ్డు పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. కొండ్రారాజుపేట మెయిన్ రోడ్డు వర్షం కురిస్తే నడవలేని పరిస్థితి నెలకొందని కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూనవరం మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనాల రాకపోకలకు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ ఆసుపత్రి, బ్యాంకులకు వెళ్లాలన్నా నానా అవస్థలు పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులు బాగు చేయాలని కోరుతున్నారు.

దేశభక్తిని చాటిచెప్పేలా 'హర్ ఘర్ తిరంగా'

12న బీచ్ రోడ్డులో తిరంగా యాత్ర
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కేంద్ర పర్యాటక సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య స్ఫూర్తిని కాపాడుతూ, దేశభక్తిని చాటిచెప్పేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలను ఈ రోజు నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోనూ జాతీయ పతాకం ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ రోజు నుంచి 13 వరకు 'తిరంగా యాత్ర', 'తిరంగా సెల్ఫీలు', 'తిరంగా ట్రిబ్యూట్', 'తిరంగా మేళా' వంటి కార్యక్రమాలు జరుగుతాయని 12న ఉదయం 7గంటలకు బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకూ భారీ ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ర్యాలీలో అన్నివర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. థింసా, కోలాటం వంటి కళా రూపాల ప్రదర్శనతో తిరంగాయాత్ర జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్రలేఖనం,తిరంగా రంగోలి, వ్యాస రచన వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. జివిఎంసి పరిధిలో పబ్లిక్ మోటివేషన్, అవగాహన కార్యక్రమాలకు యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యత వహిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో జెడ్పీ సిఈఓ ఆధ్వర్యంలో గ్రామ, వార్డ్ సచివాలయ సిబ్బంది ఇంటింటా జాతీయ పతాకంతో సెల్ఫీలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు పర్యాటక,సాంస్కృతిక అధికారి సమన్వయం వహిస్తారని, విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

అవార్డు అందుకుంటున్న కీర్తిలాల్ బిజినెస్ స్ట్రాటజి డైరక్టర్ సూరజ్‌శాంతకుమార్

కీర్తిలాల్స్ జ్యూయలర్స్‌కు ప్రత్యేక అవార్డ్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రముఖ వజ్రాభరణాల సంస్థ కీర్తిలాల్స్‌కి రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2025 లో ప్రత్యేక అవార్డ్ లభించింది. ఈ మేరకు జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సంవత్సరపు సహజ వజ్ర చెవిపోగులు (నేచురల్ డైమండ్ ఇయర్ రింగ్స్ ఆఫ్ ది ఇయర్) అవార్డును అతిథులైన ప్రమోద్ మెహతా, పులికిట్ మెహతా చేతుల మీదుగా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ స్టోర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ జ్యూయలరీ రంగంలో ప్రతిష్టాత్మకంగా పేరుగాంచిన రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డులలో 2025 లో సహజ డైమండ్ చెవిరింగుల విభాగంలో అవార్డు లభించడం ప్రత్యేక గుర్తింపుగా చెప్పారు. భారతదేశం యొక్క ప్రధాన ఆభరణాల బ్రాండ్స్ గా కీర్తిలాల్స్‌కి జరిగిన సత్కారం అన్నారు.

వైసిపి నేతలు జైలుకు అలవాటు పడిపోయారు

- టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యావత్ రాష్ట్రమంతా అద్భుతమైన కూటమి పాలన కోరుకున్నారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండిబాబ్జి అన్నా రు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమికి ఐదు సంవత్సరాలు పాలించమని పీఠాన్ని ప్రజలు ఇచ్చిన తీర్పుని వైసిపి నేతలు గౌరవించాలన్నారు. వైసిపి నేతలకు జైలు అలవాటైపోయిందని,ఎప్పుడు పడితే అప్పుడు జైలుకు వెళ్లి వచ్చేస్తామని వైసిపి నాయకులు అనుకుంటున్నారన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసి దర్జాగా వెళ్లిపోయిన చరిత్ర వైసిపి పార్టీ వాళ్లకు ఉందన్నారు. వైసిపి నాయకుడు కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలు, ఆయన తీరు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకొనలే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలను ఉద్ధరిస్తాం ,ఎస్సిలను ఉద్ధరిస్తాం అనే మాయమాటలు చెప్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని కరుణాకర్‌రెడ్డి లాంటి వారిమీద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.



కెజిహెచ్ వైద్యులు, సిబ్బందితో విష్ణుయాదవ్

కెజిహెచ్ వైద్యులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైలుప్రమాదంలో తీవ్రంగా గాయపడి, స్పృహ కోల్పోయిన వ్యక్తికి సకాలంలో సరైన వైద్యసేవలు అందించి ప్రాణాలను కెజిహెచ్ వైద్యులు రక్షించారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మీడియాకు తెలిపిన సమాచారం ప్రకారం, జులై 26న విష్ణుయాదవ్ (26) కరకవలస వద్ద కదులుతున్న రైలు నుండి ప్రమాదశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడి, ఎడమచేయి భుజం వరకు తెగి శరీరం నుండి వేరుపడి స్పృహ లేని స్థితిలో కెజిహెచ్ అత్యవసర విభాగానికి తీసుకొని వచ్చారు. వెంటనే శస్త్ర చికిత్స చేసి వైద్యసేవలందించడంతో రోగి కోలుకున్నాడు. శుక్రవారం పూర్తిగా కోలుకున్న విష్ణు యాదవ్‌ను డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా కెజిహెచ్ వైద్యసిబ్బందికి వైద్యులకు, సిబ్బందికి ఆయన, ఆయన బంధువులు ధన్యవాదాలు తెలిపారు.